క్లుప్తంగా

రెయ్యమ్మతల్లికి పూజలు



రెయ్యమ్మతల్లిని దర్శించుకున్న తిలక్ తదితరులు

సంతబొమ్మాళి: గోవిందపురం గ్రామంలోని రెయ్యమ్మ తల్లి జాతర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. రెయ్యమ్మతల్లిని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందిగాం ఎంపీపీ నడుపూరి శ్రీరామమూర్తి, సంతబొమ్మాళి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, స్థానిక సర్పంచ్ ఆర్.రామిరెడ్డి, ఆర్.ప్రసాద్‌రెడ్డి, నాయకులు మార్పు నాగభూషణం, పరపటి శ్రీనివాస్‌రెడ్డి, నరేష్ ఉన్నారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి



టెక్కలి: మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా కేసులు రాజీ జరిగే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి అన్నారు. టెక్కలి కోర్టు పరిధిలోని పోలీస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసి తద్వారా కక్షిదారులకు విముక్తి కలిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కవిటి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రవివర్మ

కవిటి: గడచిన రెండు నెలలుగా ఖాళీగా ఉన్న కవిటి పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐగా రవి వర్మను నియమిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం రవివర్మ విధుల్లో చేరారు. అనంతరం ఇచ్ఛాపురంలో పర్యటనకు వచ్చిన జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐలను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషిచేస్తానన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఫిక్సిడ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన దేవరాజు శెట్టి ఇటీవల మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పాపలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం . దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కేదారిపురం గల్ఫ్ సేవా ఫౌండేషన్ సభ్యులు స్పందించారు. రూ. 35 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని పిల్లల పేరున పోస్టల్‌శాఖలో డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

చట్టాలపై అవగాహన

• సీఐ విజయ్‌కుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: ప్రస్తుత కాలంలో అధికంగా జరుగుతున్న సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో ప్రజలలో అవగాహన అవసరమని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, చోరీలు వంటి నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కొండ భీంపురం గ్రామంలో చట్టాలపై బుధవారం స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి సమావేశాలొద్దు

కవిటి: ఉపాధ్యాయుల బోధనాసామర్థ్యాలు మెరుగుపరేచేందుకు ఉద్దేశించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లను మొక్కుబడిగా మిగల్చొద్దని జిల్లా పరిశీలకుడు జి శంకర్, జీసీడీవో నీరజ అన్నారు. బొరివంకలో నిర్వహించిన ఆంగ్లం కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో చైర్మన్ సనపల రామకృష్ణ, సీఆర్‌పీ బాగా తులసయ్య పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యాపారం!



ఆదివారం సంత వద్ద సర్వీసు రోడ్డులో అరటిపళ్ల వ్యాపారుల ఆక్రమణ

- సర్వీసు రోడ్లను ఆక్రమిస్తున్న వ్యాపారులు
- ఆదివారం సంత కూడలిలో ప్రమాదాలు
- భైరిపురం జంక్షన్‌లోనూ కూరగాయల లారీలతో ఇబ్బందులు

కంచిలి: కొంతమంది వ్యాపారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా హైవేలను ఆనుకొని ప్రజలకు ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశంతో నిర్మిస్తున్న సర్వీసు రోడ్లను సైతం వ్యాపారులు విడిచిపెట్టడం లేదు. వీటిని ఆక్రమించేసి వివిధ వ్యాపారాలు చేస్తుండడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలబారిన పడుతున్నారు. చెన్నై నుంచి కోల్‌కత్తా జాతీయ రహదారిలో అత్యంత బిజీగా ఉండే రోడ్లను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారుల సంస్థ నిర్మించిన సర్వీసు రోడ్లు వివిధ రకాల వాహనాలతోను, వ్యాపారుల స్వార్థంతో ఆక్రమణలకు గురౌతున్నాయి. రోడ్ల మీదే వాహనాలు నిలిపి లావాదేవీలు చేస్తుండటంతో వాహనదారులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కంచిలి మండల పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని నిర్మించిన వివిధ సర్వీసురోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నాయి. వాటి మీద వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. వాహనదారులు కొన్ని సందర్భాల్లో జాతీయ రహదారి మీదుగానే రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురౌతున్నారు. ముఖ్యంగా మకరాంపురం గ్రామంలోని ఆదివారం సంత కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంత జరిగే రోజుతోపాటు మిగతా ఆరు రోజులు కూడా ఇక్కడ ఇదే పరిస్థితి తలెత్తుతోంది. సర్వీసు రోడ్డులో అరటిపళ్ల లోడ్లు తీసుకొచ్చి అక్కడే లోడింగ్‌లు, అన్‌లోడింగ్‌లు చేపడుతున్నారు. దీంతో కేసరపడ, జక్కర,



నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులకు గురౌతున్న భైరిపురం జంక్షన్ సర్వీస్‌రోడ్డు

అర్జునాపురం, బిన్నళకొత్తూరు, రేఖాదేవిపురం గ్రామాలతోపాటు ఒడిశా సరిహద్దు గ్రామాలైన చీకటి కేసరపడ, జరడా తదితర గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా ఆక్రమించడంతో వారు తప్పనిసరి పరిస్థితుల్లో జాతీయ రహదారి మార్గంలో రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే భైరిపురం జంక్షన్ వద్ద కూడా మఠం సరియాపల్లి రోడ్‌కు రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సర్వీసు రోడ్డులో ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయల హోల్‌సేల్ షాపులు వారు రోడ్డుపైనే గంటల తరబడి లారీలు నిలిపి అన్‌లోడింగ్‌లు చేయడం, కొన్ని దుకాణాల వద్ద లావాదేవీలు చేపడుతుండడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. మరోవైపు మెకానిక్‌షెడ్‌కు చెందిన వాహనాలు కూడా రోడ్డు పక్కనే శాశ్వతంగా నిలిపివేస్తున్నారు. జాడుపూడి గ్రామం పరిసరాల్లోను సర్వీసురోడ్లపైన దాబాల వద్ద వాహనాలు నిలిపి వేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, పోలీసుల స్పందించి సర్వీసు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మకరాంపురం ఆదివారం సంత కూడలి వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. చాలా సందర్భాల్లో ఏం చేయాలో తెలియడం లేదు. అరటి పళ్ల వ్యాపారులు నిత్యం రోడ్డు మీదే అన్‌లోడింగ్‌లు చేస్తున్నారు. ఆదివారం సంత రోజున స్టాల్స్ అన్ని కూడా సర్వీసు రోడ్డు మీదే నేరుగా పెడుతుండటంతో ఆ రోజంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– టి. ఢిల్లీరావు, బిన్నళకొత్తూరు గ్రామం

ఆక్రమణలు తొలగిస్తాం



మండల పరిధిలో జాతీయ రహదారుల పక్కన ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన సర్వీసు రోడ్లలో ఆక్రమణలు తొలగించేందుకు అత్యవసరంగా చర్యలు చేపడతాం. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనిచేస్తాం.

– పి.పారినాయుడు, ఎస్‌ఐ, కంచిలి

కాలం చెల్లిన వంతెన..



ఇచ్ఛాపురం మండలం డొంకూరు సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. డొంకూరు మత్స్యకార గ్రామంతో పాటు చుట్టుపక్కల ఐదు గ్రామాలు, ఒడిశాలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఈ వంతెనే కీలకం. రోజూ ఎనిమిదిసార్లు రాకపోకలు సాగించే రెండు ప్రైవేటు బస్సులతో పాటు ఇసుక ట్రాక్టర్లు, చేపల లోడులతో వెళ్లే భారీ లారీలు ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. పాతికేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన కాలం చెల్లింది. సముద్రం ఉప్పు గాలికి వంతెన దిగువ పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన కూలక ముందే కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

దుమ్ము రేగుతోంది..



వజ్రపుకొత్తూరు మండలంలో పలు రోడ్లు దుమ్ము రేగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నువ్వలరేవు–టెక్కలిపట్నం రోడ్డు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు సుమారు రూ.50 కోట్లు వ్యయంతో చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా 60 శాతం పూర్తయ్యాయి. పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా రోడ్డులలో గల బెండి, బెండి గేట్, బైపల్లి, డోకులపాడు, బాతుపురం, ధర్మపురం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. పనులు ఆగిపోవడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో దుమ్ము, ధూళి రేగి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

వంతెన బాగుచేయరూ..



టెక్కలి మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధి గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారిపై ఉన్న వంతెన మరమతులకు గురైంది. దీంతో ఆ గ్రామాలకు బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీంపురం గ్రామం సమీపంలో రహదారిపై ఉన్న వంతెన మరమ్మతులకు గురై కిందకు కుంగిపోయింది. దీనిపై నుంచి వాహనాలు వెళ్తే కూలిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపటాటలని ప్రజలు కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

పొంచిఉన్న ప్రమాదం..



కాశీబుగ్గ జాతీయ రహదారి నుంచి మందస మండల కేంద్రానికి వెళ్లే ప్రవేశ మార్గం వద్ద భారీ వృక్షం మోడుగా ఉంది. రోడ్డు వేసే సమయంలో దీన్ని అధికారులు తొలగించలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇక్కడ రోడ్డు వేయకుండా విడిచిపెట్టేశారు. ఫలితంగా వాహనదారులు ఇక్కడకు వచ్చేసరికి ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వెళ్తే మోడువారిన చెట్టును ఢీకొనే ప్రమాదం ఉందనే ఆందోళనను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చెట్టు మోడును తొలగించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

– కాశీబుగ్గ

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



సంతబొమ్మాళి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో జి.చిన్నవాడు



టెక్కలి గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది



నందిగాం గ్రంథాలయంలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు



కాశీబుగ్గలు: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో వసంతకుమార్, ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం

గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథులు, గ్రంథాలయ అధికారులు బహుమతులను ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథం



మందసలో బహుమతులు అందజేస్తున్న మేజర్ పంచాయతీ ఈవో నవీన్



కాశీబుగ్గ: రామకృష్ణమిషన్ గ్రంథాలయ సందర్శనలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

• డీఈవో తిరుమల చైతన్య



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

సోంపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. రాజాం గ్రామంలోని కేజీబీవీ, జింకిభద్ర ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బోధనపై ఆరా తీశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి టి.కాంతమ్మ, జింకిభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వేణుగోపాలరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల పరిధిలో లేని సమస్యలపై వెసులుబాటు కల్పించాలి

టెక్కలి: అపార్ నమోదు విషయంలో పాఠశాల పరిధిలో లేని సమస్యలపై ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలని యూటీఎఫ్ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు నాయకులు కె.దాలయ్య, బి.శంకరరావు, టి.వైకుంఠరావు, పి.గణపతిరావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ఆధార్ ఆధారంగా పాఠశాల రికార్డు ప్రకారం పుట్టిన తేదీ స్టడీ సర్టిఫికెట్లను తయారు చేసి ఆ పరిధిలో ఉన్న వీఆర్‌ఓలకు అందజేయాలని ఆర్డీఓ పేర్కొన్నట్లు సంఘ నాయకులు తెలిపారు. అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో సహకరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీఓ వెల్లడించినట్లు చెప్పారు.

నటరాజ స్వామి విగ్రహ ప్రతిష్ట



సోంపేట: బెంకిలి గ్రామంలోని ఉమామహేశ్వర దేవాలయ ప్రాంగణంలో నటరాజ స్వామి విగ్రహ ప్రతిష్టను గ్రామస్తులు, ఓం నమః శివాయ భక్తబృందంచే బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం, భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలి



కాశీబుగ్గలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: విజయవాడ జింఖానా మైదానంలో వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ప్రజా హక్కుల సభ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పలాస–కాశీబుగ్గ పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్ నుంచి శ్రీనివాస్ లాడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీ ఊసెత్తక్కపోవడం దారుణమన్నారు. చంద్రబాబు దృష్టంతా కార్పొరేట్ కంపెనీలు, కాంట్రాక్టర్‌లు, విద్య, వైద్య రంగ మాఫియాలపైనే ఉందన్నారు. వ్యవసాయ కూలీలు, కార్మికులు, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత మద్దిల మల్లేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల రైతు నాయకులు మద్దిలి రామారావు, ఏఐసీసీటీయూ నాయకులు ఈశ్వరమ్మ, వరలక్ష్మి, సుందరమ్మ, జయలక్ష్మి, పోతనపల్లి అప్పారావు, పిన్నింటి నాగేశ్వరరెడ్డి, రాజారావు, జగదీష్ రామక్రిష్ణ, యుగంధర్, కైలాస్, నారాయణ, దీపు ఉన్నారు.

సాగర్ కవచ్‌తో మెరుగైన భద్రత



పుక్కళ్లపాలెం తీరంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కవిటి: సాగర్ కవచ్ కార్యక్రమం పీరియాడికల్‌గా నిర్వహించడం ద్వారా ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్గత భద్రతపై సిబ్బందికి చక్కని అవకాశం లభిస్తుందని ఇచ్ఛాపురం సర్కిల్ ఇనస్పెక్టర్ చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని కపాసుకుద్ది, పుక్కళ్లపాలెం, కొత్త పాలెం, చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, ఇద్దివానిపాలెం, కళింగపట్నం, ఒంటూరు తీరప్రాంత గ్రామాలతో పాటు తిప్పనపుట్టుగ జంక్షన్, కొజ్జీరియా జంక్షన్‌లలో 35 మంది పోలీసులతో బుధవారం గస్తీ నిర్వహించారు. తీరప్రాంతం ద్వారా అపరిచిత వ్యక్తులు చొరబాట్లను నియంత్రణే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన ఇప్పిలి జగదీష్‌యాదవ్‌కు జిల్లా యాదవ నాయకులు సత్కరించారు. టెక్కలి నియోజకవర్గం రావివలస పంచాయతీ చిన్ననారాయణపురం గ్రామంలో జగదీష్‌ను బుధవారం కలిసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. రాష్ట్ర బీసీ సెల్ నాయకులు లొడగల కామేశ్వరరావు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస, మందస మండలాల నాయకులు దాసరి తాతారావు, వంకల కూర్మారావు, సప్ప నవీన్ ఉన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



చేయివిరిగిన చిన్నారికి పండ్లు అందజేస్తున్న డాక్టర్ బాలకృష్ణ

కాశీబుగ్గ: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు పలాస సత్యసాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం యువజనోత్సవాన్ని పురస్కరించుకుని పలాస సత్యసాయి మందిర కమిటీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రితో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రిలలో రోగులకు పండ్లు, రొట్టెలు, విభూతి ప్రసాదం, స్వామి ఫొటోలను అందజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సాధన శిబిరం ఇన్‌చార్జి జామి చిరంజీవిశ్రీనివాస్, కన్వీనర్ జగదీష్, ముఖ్యసభ్యులు పొట్నూరు శ్రీనివాస్, కామేశ్వరరావు, శరత్, రాజేష్, కొండలరావు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచిలి: కంచిలి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి.పారినాయుడును మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైను దుశ్శాలువతో సత్కరించారు. ఎస్సైను కలిసిన వారిలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, సర్పంచ్‌లు కొణపల సురేష్, పొందల ఢిల్లీరావు, గొనప సీతారాం, ఎస్.ఆర్.సి.పురం ప్రతినిధి డొక్కరి బలరాం ఉన్నారు.

విత్తనాలు పంపిణీ

సోంపేట: తాళభద్ర, మామిడిపల్లి సచివాలయాల పరిధిలోని రైతులకు రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రాయితీపై వేరు శనగ విత్తనాలను వ్యవసాయశాఖాధికారులు బుధవారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. సర్పంచ్ ఉగ్రపల్లి శారద, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నుంచి అడవిని కాపాడుకోవాలి

కంచిలి: అగ్ని ప్రమాదాల నుంచి అడవిని కాపాడుకోవాలని మందస డీఆర్‌వో ఐ.రాము అన్నారు. కుంబరినొగాం పంచాయతీ కొనక గ్రామంలో కాశీబుగ్గ అటవీ రేంజ్ అధికారి మురళీక్రిష్ణ ఆదేశాల మేరకు గిరిజనులతో 'అడవిలో అగ్ని ప్రమాదాలు–నివారణ చర్యలు'అనే అంశంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. అడవిలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కుంబరినొగాం సర్పంచ్ హరిబంధు జన్ని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, బీడి లబ్ధిదారులు, అటవీశాఖ సిబ్బంది వెంకటేష్, భానుమూర్తి, జోగారావు, దుర్గాదేవి, లక్ష్మణమూర్తి, సురేష్, కొనక, సింగుపురం, సుంకిలి గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: చిన్నసాన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బలగ తులసయ్య తండ్రి అడివయ్య ఇటీవల మృతి చెందారు. అలాగే అదే గ్రామానికి చెందిన బోనాల కూర్మారావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. వీరి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ బుధవారం పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, బోనె ఎల్లయ్య ఉన్నారు.